

# హీరా

కాళ్లకూరి శేషగిరిరావు

*అమానుషంగా తండ్రిని హత్యచేసిన నరాధముని రక్తంతో తన తండ్రికి తర్పణం విడుద్దామనుకొన్నాడు. కైపెక్కిన మెదడు; బండబారిన గుండె; కోపంతో ఎనక బారిన కళ్ళు జమీందారు లీలగా కనిపించాడు. కాని ఆయన కౌగిలిలో ఉన్న హీరా తల్లి కళ్ళకు ఆనలేదు. ఇంకేముంది? సర్వనాశనం.*

---

'ఏస్రీ, బిసినీరు బేకా? బేడా?' అనే కటువైన ప్రశ్నకు నిద్రమత్తునుబలవంతంగా వదుల్చుకొని వణుక్కుంటూ పళ్ళు బద్ధకంగా విరుచుకుని వెళ్లి తలుపు తీశాను. నిలువెత్తు మనిషి గంభీర వదనంతో చిరునవ్వు నవ్వుతూ నిల్చుని ఉన్న మస్తాను సాహెబును చూడగానే ఎక్కడలేని కోపం వచ్చి, 'అప్పుడే తెల్లారిందీ నీ వేన్నీళ్లకు' అని విసుక్కున్నాను. 'గంటే నోడిరీ' అని గడియారం కేసి చూపించాడు. ఎనిమిదిన్నర చూపిస్తున్న గడియారాన్ని కూడా ఒకసారి తిట్టుకుని, 'సరే తగలడు' అంటూ టూత్ బ్రష్, తాటాకు, సబ్బు, తువ్వాలు తీసుకుని బయలుదేరాను, బాత్ రూంవైపు.

అది నేను ధార్వాడలో ఎమ్. ఎస్‌సి. చదువుతున్న రోజులు. మాకోసం యూనివర్సిటీవారు ప్రత్యేకంగా ఏర్పరచిన హాస్టలేమో, పట్టుమని పదిమందికన్నా ఎక్కువలేము. అందువల్ల మాకు స్నానాలకు ప్రత్యేకమే, నౌకరు ప్రత్యేకమే. నేను హాస్టల్లో చేరినదగ్గరనుండి మస్తాను నేనంటే పాపం ప్రత్యేక శ్రద్ధ చూపించేవాడు. ఖర్మ, రోజూ అందరికన్నా చివర్న స్నానానికి వెళ్ళేది నేనే!

కాని, ఆనాడు ఎప్పుడూ లేనిది మస్తాను ముఖంనుంచి రోజూలాగా హాయితో కూడిన నవ్వు రావడం కనిపించలేదు. ఏదో కొంచెంగా నవ్వుతున్న చిరునవ్వుకూడా ఏదో ఆందోళనను దాచేందుకే అనిపిస్తోంది. రోజూలాగా మనసు విప్పి మాట్లాడడం లేదు. ఇవన్నీ నేను ముందే గమనించాను. కాని ఎందుకులే అని ఊరుకున్నాను. కాని, నేను స్నానంచేసి, ఇవతలికి రాగానే, స్నానాల గదికి తాళం వేసేసి, వెళ్లడానికి సన్నద్ధుడవుతున్న మస్తానును చూడగానే ఆశ్చర్యం వేసింది.

'ఏంమస్తాన్, ఇంటికి వెళ్లిపోతున్నట్లున్నావ్? భోజనం చెయ్యవా ఏం?' అని ప్రశ్నించాను వచ్చీ రాని నవ్వడంలో. మస్తాన్ నాకేసి ఒకసారి జాలిగా చూసి, 'నా హీరాకు ఇవాళ ఒంట్లో బాగుండలేదు సాబ్. అందుకని త్వరగా పోతున్నాను' అని నవ్వడంలోనే సమాధానం చెప్పి చరచరా నడుచుకుంటూ వెళ్లిపోయాడు.

సన్నని ఆకారం, గంభీరమైన ముఖం, నవ



రత్తు చేసినట్లు కండలు తిరిగిన ఒళ్ళు, ఆరడుగుల మహాకాయం—మస్తాను సాహెబును చూసిన వారెవరూ ఒక్కసారైనా ఉలిక్కి పడకుండా ఉండలేరు. అతనే కనుక క్రూరుడై ఉంటే బహుశః అతను చేయలేని ఘోరకృత్యం అంటూ ఉండదేమో. కాని అతని మనసు వెన్నపూస. మాట పైకి కటువుగా అనిపించినా, చక్కని మధురిమ ధ్వనిస్తుంది అతని భావంలో. హీరాను గురించి అతను నాతో ఎప్పుడూ ముచ్చటించలేదు. అతని కీ ప్రపంచంలో 'నా' అనేవా రెవరూ లేరనే అనుకుంటూ ఉండేవాణ్ణి నేను. కాని అతనికీ ప్రేమానుబంధాల పటాటోపం ఉందని అప్పుడే బోధపడింది.

ఆ రోజంతా నేను మస్తాను గురించి తలవనే లేదు. కాని ధార్వాడ రెస్టారెంటులో కాఫీ త్రాగి గదికి వచ్చేసరికి, ఎదురుగుండా పిట్టగోడ నానుకుని శూన్యంలోకి బాధగా చూస్తున్న మస్తాను కనిపించేసరికి ప్రొద్దుటి ఉదంతం జ్ఞాపకం వచ్చింది. 'ఏం మస్తాన్, ఏం జరిగింది?' అని ఆత్రుతగా ప్రశ్నించాను. అతను ఉలిక్కిపడి నన్ను చూసి 'సాబ్, మీరా?' అన్నాడు. అతని కళ్లలో అశ్రువులు నిలిచిఉన్నాయి. తుడుచుకుంటూ, వచ్చే ఉద్రేకాన్ని ఆపుకుంటూ, 'నా హీరా నన్ను విడిచి వెళ్లిపోయింది సాబ్' అని బాధగా కూలబడి పోయాడు. పసిబిడ్డలా వలవలా ఏడిచాడు. పైకి వినిపించకుండా, 'నాలాంటి పాపాత్ముణ్ణి తిరిగి మనిషిగాచేసి నా హీరా నన్నువదిలి చచ్చిపోయింది సాబ్. దాని జీవితం ఇంత త్వరగా అంతమవుతుందని, నా ఖర్మం ఇట్లా కాలుతుందని అనుకోలేదు' అంటూ వాపోయాడు. అతన్ని చూస్తే ఎంతో జాలివేసింది. కాసేపు ఊరుకుని 'పిల్లలా?' అని అడిగాను. 'ఒక్కగా నొక్క పసిగుడ్డును నా చేతిలో వదిలి మరీ వెళ్లింది సాబ్' అన్నాడు



ఆప్యాయం

ఫోటో—యశవంత్ నఖారే (రాజపూర్)

కడుపు తరుక్కుపోయేలా విట్టూరుమ్మా.

జీవితపు లోతుల్ని తరచి తరచి చూసి, ఒడుదుడుకు లన్నిటినీ తేలికగా దాటినవాడిలా కనిపించే మస్తాన్ సాహెబ్, సొడారిన కళ్లతో నిశ్శబ్దంగా కృంగిపోతూంటే నాకు విచారము, ఆశ్చర్యము కూడా కలిగాయి. కాసేపు నిశ్శబ్దంగా ఊరుకుని, తర్వాత మస్తాన్‌ను అడిగాను, అతని జీవితపు బాటలకు, హీరాకుగల సంబంధం. నాకేసి ఒకసారి నిశితంగా చూసి 'సాబ్, మనసులోని ఆరాటం ఇంకోరితో చెప్పుకుంటే పోతుందంటారు. నా కథ ఒక వింత గాథ. ఒక పాప పంకిలమైన కలుష గాథ. కాని ఆ పాప కలుషిత జీవితానికి వెలుగు చూపించి, నా జీవితానికి ఒక బాట చూపించి మనశ్శాంతిని చేకూర్చింది హీరా నాకు. ఆ కథ చెబుతా. వినండి' అని గోడకు చేరబడి మొదలుపెట్టాడు తన కథ. ఉద్రేకంగా కన్నడంలో చెప్పుకుపోయిన ఆ కథను వీలైనంతవరకు తెలిగించి వ్రాస్తున్నాను.

• • •

మాదసలు ఈ ఊరుకాదు. ఇక్కడకు పదమూడు మైళ్ల దూరంలో ఉన్న నాగతాని మా స్వస్థలం. మా అయ్య ఇమాం సాహెబ్ అంటే అక్కడ అందరికీ ఎప్పుడూ కళ్లలో మసలుతూ ఉంటాడు. కండలు తిరిగిన దేహం, ఎప్పుడూ ఎర్రగా ఉండే కళ్లు, కోరమీసాలు; మా అయ్యను

## హీరా

చూసినవారంతా దడుసుకునేటట్లుండేవాడు. కాని, ఎప్పుడూ ఎవరికీ ఎగ్గు చేసిన పాపాన పోలేదు. దేవుడు మనకు శక్తి నిచ్చింది మంచి పనులు చేయడానికేనని ఆయన మతం. అందుకే శుభ్రంగా వ్యవసాయం చేసుకుని, హాయిగా మగవాడిలా బ్రతికేవాడు. ఆయన జీవితంలో చేసిన పొరబాటల్లా నామీద చూపిన అమిత వాత్సల్యం, గారాబం. నా తల్లి నా చిన్నతనంలోనే పోయింది, నన్ను పసిగుడ్డుగా మా అయ్య చేతిలో పెట్టి. అప్పటినుంచి కంటికి రెప్పలా చూసుకునేవాడు. తను పస్తుపడి ఉన్నాసరే, నా కోరికలు తీర్చడం మాత్రం ఎప్పుడూ అశ్రద్ధ చేసేవాడు కాదు. మా ముస్లిములలో వ్యవసాయమే వృత్తిగా పెట్టుకొన్నవారు గాని, యవ్వనంలోనే భార్య పోయినప్పుడు తిరిగి పెళ్లి చేసుకోనివారు కాని చాలా తక్కువ. ఈ రెండు పద్ధతులను మా అయ్య ఎంతో శక్తివంతంగా ఆచరించగలిగాడు.

కాని, నా విషయమే వేరు సాబ్. పోలిక, దేహపుష్టి మా అయ్యదగ్గర్నించి పుణికి పుచ్చుకోగలిగానే గాని ఆయన గుణం ఒక్కటే నాలో అలవడలేదు. బహుశః ఆయన చేసిన గారాబం వల్లనే గావును, మహా బండదేరిపోయాను. మా ఊళ్లో రౌడీ గుంపుకు నేను నాయకుణ్ణి. భిడీలమీద బీడీలు కాలుస్తూ రోడ్ల వెంబడి ఛాతీ విరుచుకుని నడుస్తూ ఉంటే, జనం పికాపికలైపోయేవారు. జామిచెట్లు, మామిడిచెట్లు కూడా నన్ను చూసి హడలిపోయి కాయల్నీ, పిందెల్నీ దాచుకునేవి. ఆ కాలంలో నేను చేసే అఘాయిత్యాల్నీ అల్లరినీ తలచుకుంటే ఇప్పుడింకా సిగ్గు, అసహ్యం కలుగుతాయి సాబ్. కాని ఒకటి మాత్రం ఉండేది. అది మా అయ్యంటే వల్లమాలిన ప్రేమ, గౌరవం. ఆయనను ఎవరైనా పల్లెత్తుమాటంటే మన్నులోకి ఎముకలేకుండా బాదేవాణ్ణి. నేను చేసిన తప్పుడు పనులు చెవినిబడితే ఆయన చాలా బాధపడేవాడు. అప్పుడప్పుడు నన్ను గట్టిగా కోపగించుకొనేవాడు కూడాను. కాని ఒక్కసారి కూడా ఇలా మీద చెయ్యివేసి ఎరగడు. బహుశః అందువల్లనే నేనో, ఎన్ని చెడ్డ తిరుగుళ్లు తిరిగినా, ఎన్ని వికారపు పనులు చేసినా, ఆయన ముఖం చూడగానే బాధపడి, ఏమీ అనకుండానే వెక్కి వెక్కి ఏడ్చేవాణ్ణి. అందుకే నేనంటే కొంచెమైనా విలువ ఇంకా మిగిలిఉండేది నాకా ఊళ్లో.

నన్ను పూర్తిగా మార్చివేసిన సంఘటన జరిగినప్పుడు నా వయస్సు ఇరవైమూడు. మా ఊరికి ఆనుకుని ఉన్న పొలాలన్నీ పావురాల జమీందారుగారివే. ఆయనకు పావురాలంటే మహా ప్రేమ. ఎన్నిటినో పెంచేవాడు. అందుకే ఆయన్ను పావురాల జమీందారు అనేవాళ్లం. నాకు ఆయన పేరంటేనే మహా కసిగా ఉండేది. మేమంతా కడుపులు మాడ్చుకుని చచ్చి చెడి శ్రమిస్తే, తను హాయిగా మేడమీద కులుకుతూ అనుభవించేవాడు కదా అని మహా దుగ్ధగా ఉండేది. కాని మా అయ్యకు మాత్రం ఆయనంటే అమితమైన గురి. ఆయనంత నీతిమంతుడూ, గుణవంతుడూ లేడని తెగ పొగిడేవాడు. ఆయన మంచితనంవల్లే పుట్టుకకు మహమ్మదీయులమైనా, తక్కినవారితో సమానంగా పొలాన్ని గుత్తకు తీసుకుని వ్యవసాయం చేయగలుగుతున్నాం అనేవాడు మా అయ్య. మంచితనమో మరే తనమో నాకు తెలియదు కాని, సాబ్, ఆ ఊళ్లోని పెద్ద కాపుల్లో హిందువు కానిది మా అయ్య ఒక్కడే. ఇది అందరికి గండ కత్తెరగా ఉండేది.

నాకు ఇప్పటికీ బాగా జ్ఞాపకం. మా అయ్య, ఎప్పుడూ లేనిది నన్ను కూడా పొలానికి రమ్మని బతిమాలేవాడు. అప్పుడే పొలాలన్నీ పొట్టలు విచ్చుకొని కోతలకు సిద్ధంగా ఉన్నాయి. అంతకు ముందు ఎప్పుడూ లేనంతగా మా అయ్య సాగు చేసిన భూమి పండింది. ఆ ఏడాది, సరిగ్గా గింజ పట్టే సమయానికి మిడుతలదండు, ఎప్పుడూ లేనంతది వచ్చి మా ఊరిమీద పడింది సాబ్. మా మతాచారం ప్రకారం అల్లాకు ఒక గోవును

బలి ఇచ్చి, నేనూ, మా అయ్యా, పాలెకాపులూ పొలంలో కాపలా కాసి, కారే చెమటల్ని లెక్క చేయకుండా, నొప్పులతో సతమతమయ్యే కాళ్లను బద్ధకించకుండా, ఇటూ అటూ పరుగుస్తూ పరుగెత్తి, అన్ని ఆకులమీద మందు జల్లుతూ మా పొలాన్ని అతి శ్రమతో మిడుతల బారినుండి తప్పించాం. బహుశః కొంచెం ఒళ్లు దాచుకున్నారేమో తక్కినవారి పొలాలు చాలా దెబ్బ తిన్నాయి. దానితో మామీద అసహనం మరీ ప్రబలిపోయింది. అక్రమంగా గోహత్య చేశామని దుయ్యబట్టారు. మేము చేసిన పాపంవల్లే తమ పొలాలు దెబ్బ తిన్నాయని యాగీ చేశారు. ఊళ్లోని పాలికాపులు, పెద్దకాపులు, గూడెంలోని చెట్టిగాళ్లు అంతా మామీద కత్తి కట్టారు. ఇలాంటి సమయంలో ఏ అఘాయిత్యం చేస్తారోనని గుండెలు పీచు పీచుమంటూ ఉండేవి మా అయ్యకు. ఇక్కడ ఇలా ఉంటని జమీందారుకు మొరపెట్టుకోనేవాడు మా అయ్య. కాని, ఆ మహారాజుకు, తన బాగు తప్ప, మా బాధ లెందుకు?

దాదాపు వారం రోజులు నేను, మా అయ్య, కూలీలు ఎప్పుడూ కన్ను మూయకుండా జాగ్రత్తగా ఉన్నాం. ఆ రోజు ఆదివారం. ఆనాడే మా రౌడీ ముఠాలోని దేవరాజ్ వచ్చి ధార్వాడలో గొబ్బి వీరన్న సినిమా ఆడుతూందని చెప్పాడు. గొబ్బి వీరన్న వేసిన సినిమా అంటే ప్రాణం. అందులోనూ అసలే ఆకతాయి వాణ్ణేమో, ఎవరైనా ఒక్క రవ్వవేస్తే చేస్తే చాలు, నా ఒళ్లంతా భుగభుగ మండిపోయేది. అయ్యతో చెప్తే వెళ్లనివ్వడు. మిత్ర బృందం అంతా కాసుకుని ఉంది. పాప్, చెడ్డ సహవాసం ఘోర వ్యసనం క్రూరంగా నామీద విరుచుకుపడింది. మెదడంతా మొద్దుబారిపోయింది. కళ్లు మూసుకుపోయాయి. మా అయ్యతో ఒక్క మాటైనా అనకుండా, కొండంత ఆపద వెన్నంటి వస్తున్నా తెలుసుకోలేక ఈలలు వేసుకుంటూ మా ముఠాతోపాటు ధార్వాడ వచ్చే రైలెక్కేశా.

నేను తిరిగి మా ఊరు చేరేసరికి రాత్రి ఒంటి గంట దాటింది. వ్యసనపు బరువు పూర్తిగా దిగిపోయి, మనసంతా మా అయ్యను చూడడానికి ఉబలాట పడుతూంది. దూరంగా వినిపించే నక్కల కూతలు నా నవనాడుల్లోనూ జీర్ణించుకొనిపోయి ఏదో భయాన్నీ, ఉద్వేగాన్నీ కలిగిస్తున్నై. అడుగులో అడుగు వేసుకుంటూ ఇంటికి వచ్చా. తాళంవేసి ఉంది. పొలానికి కాపలాకై వెళ్లాడనే ఉద్దేశ్యంతో పొలానికి బయలుదేరాను. పొలం ఇంకా కనుచూపు మేరలో ఉండగానే ఏడుపులు వినిపించినై. అడలే గుండెల్తో సడలే ధైర్యంతో పరుగెత్తుకు వెళ్లాను. కాని అప్పటికే అంతా అయిపోయింది. నెత్తురు మడుగులో మా అయ్య జీవాలను వదిలి పడిఉన్నాడు. చుట్టూ ఉన్న



గుర్రానికి తగిన రౌతు

ఫోటో—బ్రహ్మదేవ్ (డేరా డూన్)


పాలికాపులంతా దెబ్బలతో మూలుగుతున్నారు. 'ఎవరీ అఘాయిత్యం చేసింది' అని కంఠం విరుచుకు ప్రశ్నించా. ఎవరూ ఏమీ చెప్పలేదు. నా శరీరంలోని ప్రతి నెత్తురుచుక్కను అశ్రువుగా మార్చి మా అయ్య నిర్జీవ దేహానికి తర్పణం విడిచాను. ప్రతీకార కాంక్షతో, రూపులేని కసితో, పగతో శరీరంలోని ప్రతి అణువూ ఆక్రోశిస్తూంది. పలవరిస్తూంది. దాదాపు ముప్పయి మంది చెట్టిగాళ్లు ఈ పని చేశారని తెలుసుకున్నాను. నేను ఒక్కణ్ణే వారందర్నీ ఏమి చేయగలను? కాని ఏదో చెయ్యాలి. ఇలాంటి ఊహలతో వెర్రెక్కిపోతున్నాను.

మర్నాడు దేవరాజ్ నాదగ్గరకు వచ్చాడు. మా అయ్య మరణానికి సంతాపం వెళ్లబుచ్చాడు. నాకు పురెక్కించి ధార్వాడ తీసుకెళ్లినందుకు విచారించాడు. ఇంక వెళ్తానని లేస్తూ, 'కాని మస్తాన్, మన జమీందారయ్యగారున్నంతవరకు నీవు ఈ ఊరు విడిస్తే మంచిదేమో' అన్నాడు. ఆ మాట వినగానే ఒక్క ఉదుటున దేవరాజ్‌ను పట్టుకుని లోపల కీడ్చి సంగ తడిగాను. బెదురుతూ బెదురుతూ, తన గూడెంవాళ్ల ద్వారా తెలుసుకున్న విషయాన్ని రహస్యంగా చెప్పాడు. మా పొలం బాగా పండడంవల్ల, తక్కినవి చెడడంవల్ల తన లాభాలు తగ్గి మాకు లాభం వస్తూందనే అసూయతోను, గ్రామంలోని తక్కిన పెద్దల మాటలవల్ల కలిగిన కోపంతోను, జమీందారుగారు మనిషికి పాతిక చొప్పున ఇచ్చి మా అయ్యను చంపించారట.

నేనే కనుక ఊళ్లో ఉంటే నా గతికూడా అంతే అయేదట.

ఈ వార్త విన్నదగ్గరనుంచీ నా రక్తమంతా మరగడం ప్రారంభించింది. అలాంటి నీచాతి నీచుణ్ణి నమ్ముకున్న మా అయ్యని తిట్టుకున్నాను. నా బ్రతుకు ఏమైనాసరే ఆ దుర్మార్గుడి రక్తంతో మా అయ్యకు తర్పణం విడవడానికి నిశ్చయించుకున్నాను.

కాళరాత్రి. కటిక చీకటి. హృదయమంతా కవలిపోతూంది. అడుగులో అడుగువేసుకుంటూ, రోజంతా కూర్చుని పదునుచేసిన బాకును చేత్తో గట్టిగా పట్టుకుని జమీందారుగారి మేడవైపుకు బయలుదేరాను. నీడలా వచ్చే మృత్యుదేవతలా గోడలూ, చెట్లూ, చేమలూ దాటాను. పైన జమీందారుగారి గదిలో లైటు వెలుగుతూంది. తక్కిన మేడంతా నిశ్శబ్దం నృత్యం చేస్తూంది. మెల్లి మెల్లిగా కిటికీలమీదనుంచి కిటికీలమీదకు దూకుతూ జాగ్రత్తగా మేడ మీదకు చేరుకున్నాను. చేతిలోని బాకును ఒకసారి మనసారా చూసుకున్నాను. రక్తపు మడు



శ్రీ నటరాజస్వామి ఆలయం (చిదంబరం)

ఫోటో—ఎమ్. కె. రంగస్వామి అయ్యంగార్ (మద్రాసు-18)

## హీరా

గులో నిర్జీవంగా తేలుతున్న నా ప్రియతమమైన తండ్రి దుర్గతిని ఒకసారి తల్చుకున్నాను. ఎరుపెక్కిన కళ్లతో, కైపెక్కిన మెదడుతో, బండబారిన గుండెతో ఒక్క అంగలో జమీందారుగారి పడక గదిలో అడుగుపెట్టాను. కోపంతో మసకబారిన కళ్లకు మంచంమీద ఉన్న జమీందారుగారు లీలగా కనిపించారే కాని, నా కండకావరంలో ఆయన కౌగిలిలో ఉన్న హీరా తల్లి మోతి నా కళ్లకు ఆనలేదు. హుం అని హుంకరిస్తూ నా బాకును జమీందారుగారి మీదకు, ఉద్రేకంలో వణికిపోతున్న చేతులతో విసిరాను. నా బాకు మోతీ గుండెలో బలంగా గ్రుచ్చుకుపోయింది. బాధగా మూలుగుతూ గిలగిలా తన్నుకుని నేలపైబడి మరణించింది మోతీ.

కళ్లెర్రచేసి ఒక్కసారిగా లేచారు జమీందారుగారు. 'మస్తాన్' అని వెర్రికేక వేశారు. 'ఛీ దుర్మార్గుడా, నిండు ప్రాణాన్ని బలి చేశావా? అమాయకమైన ఈ మోతీ నెత్తురు నీకు ఏ అమృతాన్ని అందించిందిరా కుక్కా' అని కాండ్రించి ఊశారు. కాని చల్లారని నా పగ నన్నింకా దహిస్తూనే ఉంది. 'ఎవరు దుర్మార్గుడు? ఏమీ ఎరుగని నా తండ్రిని పొట్టను బెట్టుకున్న నీకన్నా నీచు డెవరు?' అని ఉద్రేకంగా అరిచాను. 'నీ రక్తంతోకాని నా పగ చల్లారదు' అంటూ మీదకు వెళ్లబోయాను. 'ఆగు' అని అరిచాడు. ఆ కంఠంలోని జీర నన్నాపింది. ఆయనకేసి కోపంగా చూశాను.

'మస్తాన్, నీ తండ్రికి జరిగిన ఘోరం నాకు తెలుసు. కాని నీకు ఎవరో నామీద ఏదో నూరిపోసినట్లున్నారు. ఇన్నాళ్లూ నీమీదా, నీ తండ్రిమీదా ఈ ఊరివాళ్లు ఏ అఘాయిత్యమూ చేయలేకపోయారంటే నేనే దానికి కారణం. కాని గూడెంవారికి మాత్రం మామీద పగ చల్లారలేదు. నే నెంత చెప్పినా వారు వినిపించుకోలేదు. నీ తండ్రి నెలాగైనా చంపితే, నీ లెక్క లేదనుకున్నారు వారు. అందుకే వాళ్ల నాయకుడు దేవరాజ్ నిన్ను మాయజేసి దారినుంచి తప్పించాడు. ఇప్పుడు నామీద లేనిపోనివి కల్పించి నీతో చెప్పాడు. ఈ విషయాలు నా కివాళ సాయంత్రమే తెలిశాయి. వెంటనే పోలీసు రిపోర్టు ఇచ్చాను. సరిగ్గా రెండు గంటలక్రితం నీ తండ్రి ఇమాం సాహెబ్ హంతకులను, దేవరాజ్‌ను పోలీసులు బంధించి తీసుకువెళ్లారు. దేవరాజ్ తన నేరాన్ని ఒప్పుకున్నాడు కూడా. ఈ విషయాలు నీకు తెలుసు ననుకున్నాను మస్తాన్. అంతే కాదు. నీ తండ్రి హత్యకు సంతాపసూచకంగా ఈ ఏటి పంటంతా నీకే ఇచ్చేయవలసిందిగా కరణంతో ఇవాళ సాయంత్రమే చెప్పాను కూడా. ఇంతలో ఇంత అఘాయిత్యానికి ఒడిగట్టావు.'

నా కాలికింది భూమి బ్రద్దలై నన్ను అగాధంలోకి తీసుకుపోతున్నట్లు బాధ అనుభవించాను సాబ్. భోరుమని ఏడుస్తూ ఆయన కాళ్లమీద పడ్డాను. ఆయనమీద కసికొర్ది లోకాన్నే మరిచిపోయి, ఆయన నా కోసం, నా తండ్రికోసం, న్యాయంకోసం పడినపాట్లు తెలుసుకోలేక ఆ మహానుభావుణ్ణే హత్య చేయడానికి ప్రయత్నించిన నా అవివేకాన్ని తిట్టుకున్నా. ఒక అమాయక ప్రాణి రక్తాన్ని బలి తీసుకుని, ఇంకో అమాయక ప్రాణిని అనాథ చేసిన నా క్రౌర్యానికి నన్ను నేనే శపించుకున్నాను. నాలోని పశ్చాత్తాపాగ్నికి జమీందారుగారి హృదయం ద్రవించింది. ఆయన నన్ను ఆప్యాయంగా లేవనెత్తి 'మస్తాన్, నేను నిన్ను క్షమించగలను. కాని న్యాయం క్షమించలేదు. నీవు చేసిన హత్యకు నీకు శిక్ష తప్పదు' అన్నారు. 'ఎంత శిక్ష వేసినా నాకు ముక్తి లేదు జమీందారుగారూ. ఇంక మీ ఇష్టం' అన్నాను.

ఆయన వెంటనే నా చెయ్యి పుచ్చుకుని బరబరా పక్క గదిలోకి తీసుకువెళ్లారు. అదే నేను మొదటిసారి హీరాను చూడడం సాబ్. పాలనురుగులాంటి తెల్లని ఒళ్లు, కోటేసినట్లున్న చక్కని ముక్కు, అమాయకంగా బెదురుగా చూసే గుండ్రటి కళ్లు నన్ను కట్టివేసినై. జమీందారుగారు నాకేసి తిరిగి 'హీరాకు నా అనే దిక్కు లేకుండా చేసిన దుర్మార్గుడవు నీవు. అందుకని నీవే హీరాను తీసుకు వెళ్లు. ఇంక నీవే దాని దిక్కు. దాన్ని ఏమాత్రం కష్టపెట్టినా ఈ హత్య సంగతి బయటకు పొక్కుతుంది జాగ్రత్త! ఇదే నీకు నేను విధించే శిక్ష! వెళ్లు' అని నన్ను, హీరాను సాగనంపారు జమీందారుగారు.

ఆ తర్వాత నేను నాగతావిలో ఒక్క క్షణం ఉండలేకపోయాను. హీరాను తీసుకుని ఇక్కడకు వచ్చేశాను. ఈ పై సంఘటన జరిగిన నాటినుండి నా జీవితము, లక్ష్యాలు కూడా మారిపోయాయి సాబ్. నే నేమి చేసినా నా స్వంత చేతులతో మాతృవిహీనను చేసిన హీరా సౌఖ్యంకోసమే, ఆనందంకోసమే. ఈనాడు నాహీరాయే నన్ను విడిచి వెళ్లిపోయింది సాబ్' అని మళ్లీ ఆక్రోశించాడు మస్తాన్.

కాసేపయాక, నేను మస్తాన్‌కేసి తిరిగి 'అయితే మస్తాన్, అడగకూడదు కాని, అడగా లనిపిస్తూంది. నీవు మళ్లీ పెళ్లిచేసుకోవా?' అన్నాను. ఈ ప్రశ్నతో మస్తాన్ ఉలిక్కి పడ్డాడు. 'మళ్లీ పెళ్లా సాబ్? ఏమిటి మీ రనేది? నా కసలు పెళ్లి కాందే?' ఈసారి నేను కలవరపడ్డాను. 'మరి హీరా......' మస్తాన్ అర్థం కానట్లు ఒక నిమిషం నాకేసి చూసి, చటుక్కున దుఃఖాన్నంతా మర్చిపోయి, పక పకా నవ్వుతూ, 'అయ్యో సాబ్, మీ కర్థమే కాలేదా? హీరా నా పెంపుడు పావురమండీ' అన్నాడు.

నేను తెల్లబోయి అలా నుంచుండిపోయాను. ★